క్లుప్తంగా

నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు


ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల/ అట్లూరు : నియోజకవర్గ ప్రజలకు ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు ప్రతీకగా నిలచిన దీపావళి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జగత్తును జాగృతం చేసే చైతన్యదీప్తుల శోభావళి దీపావళి అన్నారు. ప్రతి ఇంటా ఆనందపు కాంతులు వెల్లివిరియాలని, అజ్ఞానాంధకారాలు తొలగి విజ్ఞానదీప్తులు వెలగాలని ఆయన అన్నారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునే దీపావళి పండుగకు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి చెప్పారు.

దీపావళి కానుగా ఉద్యోగులకు ఒక నెల డీఏ


మాట్లాడుతున్న ఎన్జీఓ అధ్యక్షుడు కేజే.రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : దీపావళి కానుకగా ప్రభుత్వం నవంబర్ నెల నుంచి ఒక డీఏను విడుదల చేసిందని ప్రొద్దుటూరు తాలుకా ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కేజే.రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో అసోసియేషన్ ప్రతినిధులతో ఆదివారం జరిగిన సమావేశంలోఆయన మాట్లాడారు. డీఏతో పాటు 60 రోజుల్లో హెల్త్ కార్డులు, ఆర్టీసీ ఉద్యోగుల ప్రదోన్నతులు కల్పిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. ఈ సమావేశంలో జే.రామసుబ్బయ్య, సదాశివయ్య యాదవ్, శివరామానుజ, మహేశ్వరయ్య, నాగార్జున, ఉద్యోగులు పాల్గొన్నారు.

గుండె జబ్బులను అశ్రద్ధ చేయొద్దు


గుండె పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : గుండె జబ్బులను అశ్రద్ధ చేయరాదని కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని లక్ష్యా హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత గుండె జబ్బులు, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి 44 మందికి పరీక్షలు నిర్వహించి 21 మందికి ఈసీజీ, 8 మందికి గుండె స్కానింగ్ చేయించారు. డాక్టర్ హరిత 33 మందికి కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, హరిత మాట్లాడుతూ ప్రతి నెలా మూడో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పేద, మధ్య తరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా శివరాం


నియామక పత్రాన్ని అందుకుంటున్న నేట్లపల్లి శివరాం

మైదుకూరు : అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా మైదుకూరు మండలం పెద్దశెట్టిపల్లెకు చెందిన నేట్లపల్లె శివరాం ఎన్నికయ్యారు. ఆదివారం పాండిచ్చేరి యానంలో జరిగిన ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి అఖిల భారతీయ యాదవ మహాసభ సంయుక్త కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం కడప జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నేట్లపల్లి శివరాంను మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా లాక వెంగల్‌రావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

కడప ఎడ్యుకేషన్: నూతన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రసాద్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరాంజులరెడ్డి అన్నారు. ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్షుడు బత్తల రాజు ఆధ్వర్యంలో డీఎస్సీ ఉత్తీర్ణులై బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు ఆదివారం కడప ఎన్జీవో కార్యాలయంలో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ నిబంధనలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ గురించి వివరించారు. రాజశేఖర్‌రెడ్డి, బాబు, నాగభూషణం, నారాయణరెడ్డి, చెన్నారెడ్డి, శంకర్‌రెడ్డి, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో కుంటుపడిన పరిపాలన

- రెండు నెలలుగా నిలిచిన సిబ్బంది జీతాలు
- మధ్యలో ఆగిన పలు అభివృద్ధి పనులు


బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో పరిపాలన కుంటు పడింది. పాలనా వ్యవహారాలు రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ చేతికి తీసుకోవడంతో ఇక్కడ పరిస్థితులు విజయవాడకు చేరాలంటే ఆలస్యం అవడంతో పరిపాలన కొనసాగాలంటే తీవ్రజాప్యం జరుగుతోంది. మఠం మేనేజర్ ఈశ్వరాచారికి బాధ్యతలు ఉన్నా చెక్కు పవర్ మాత్రం ఆయనకు లేదు. ప్రతి చిన్న కార్యక్రమం జరగాలన్నా కమిషనర్ ఉత్తర్వులు రావాలి. ఇందులో భాగంగా రెండు నెలలుగా సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. రెండు నెలలకు ముందు పాలనా వ్యవహారాల కోసం బి.మఠంకు ఏసీ స్థాయి అధికారి శంకర్‌బాలాజీ పిట్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకుని పరిపాలనను కొనసాగించేవారు. చెక్కు పవర్ కూడా ఆయన చేతిలో ఉండేది. పలు అభివృద్ధి పనులు, ఉత్సవాలకు ఎండోమెంట్ కమిషనర్ అనుమతులు తీసుకుని పనులు కొనసాగించేవారు. రోజువారి కార్యక్రమాలు, సిబ్బంది జీత భత్యాలు ఇక్కడనే పరిష్కరించేవారు. ఆయనను తొలిగించిన ఎండోమెంట్ కమిషనర్ ఆయన స్థానంలో మరొక ఈఓ స్థాయికి బాధ్యతలు ఇవ్వకుండా పరిపాలన వ్యవహారాలు కమిషనర్ తీసుకోవడంతో ఇక్కడ సమస్యలు వస్తున్నాయి. మఠం ఆదీనంలో ఉన్న వ్యాపార సత్రాలను తొలగించి రెండు నెలలు దాటుతున్నా ఇంతవరకు ఆ స్థానంలో తిరిగి నిర్మాణాలు చేపట్టకపోవడం, నిలిచిన అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంతో పాటు పలు సేవాకార్యక్రమాలు మఠం మేనేజర్ నిర్వహించలేక పోతున్నాడు. నవంబర్ 1 నుంచి 3 వరుకు బ్రహ్మంగారి 417వ జయంతి ఉత్సవాలు నిర్వహించాల్సి ఉంది. ఈ ఉత్సవాలు జరగాలంటే స్థానికంగా పరిపాలన అధికారి ఉండాలి. మరి కమిషనర్ అందుబాటులో ఉంటారా లేదా అనేది భక్తులలో ప్రశ్నార్థకంగా మారుతుంది. రెండు రోజుల క్రితం తొలగించిన వ్యాపార సత్రాలలో కొనసాగిస్తున్న వ్యాపారులు ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌ను బి.మఠంకు వచ్చినప్పుడు నిలదీశారు. మాకు తక్షణం న్యాయం చేయకపోతే ఆందోలన చేయక తప్పదని హెచ్చరించారు. బి.మఠంలో పాలనా వ్యవహారాలకోసం ఎండోమెంట్ కమిషనర్ ఈఓ స్థాయి అధికారిని నియమిస్తాడా లేక ఆయనే కొనసాగుతాడా అనేది ఆయన నిర్ణయంపై ఉంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి బ్రహ్మంగారిమఠంపై పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మోదీ సభకు రూ.400 కోట్లు ఖర్చు చేయడం దుర్మార్గం


మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్

బద్వేలు అర్బన్ : కర్నూలులో ఈ నెల 16న సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ పేరుతో నిర్వహించిన మోదీ భజన సభకు రూ.400 కోట్లు ఖర్చు పెట్టడం దుర్మార్గమని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్‌నగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ పేరుతో నిర్వహించిన సభ పూర్తిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భజనకు మాత్రమే పరిమితమైందని, కూటమి నేతల స్వార్థ, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు ఈ సభ వేదికగా మారిందన్నారు. రాష్ట్రానికి గాని రాయలసీమకు గాని ఈ సభ ద్వారా ఎలాంటి ప్రయోజనాలు చేకూరలేదని అన్నారు. మోదీని పొగడ్తలతో ముంచెత్తడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పోటీ పడటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర ఖజానా నుండి రూ.400 కోట్లు సభ కోసం ఖర్చు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అలాగే చంద్రబాబునాయుడుకు రాష్ట్ర ప్రయోజనాల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని మరోసారి కర్నూలు సభ ద్వారా స్పష్టమైందని అన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, జయరామరాజు, విజయరావు, మహబూబ్‌బాషా, నారాయణ, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విలువలు పెంపొందించడమే ఆపస్ లక్ష్యం

బద్వేలు అర్బన్ : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంతో పాటు విద్యార్థుల్లో జాతీయ భావం, నైతిక విలువలు పెంపొందించడం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టెంచెన్నయ్య పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించిన ఆపస్ బద్వేలు రీజియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి అనేక బకాయిలు ఉన్నప్పటికీ కేవలం ఒక డీఏతో సరిపెట్టడం ఉపాధ్యాయులను తీవ్ర నిరాశకు గురి చేసిందని అన్నారు. రావాల్సిన ఐఆర్, పీఆర్సీ, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఈహెచ్‌ఎస్, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలపై రాబోవు రోజుల్లో ఉద్యమించక తప్పదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం బద్వేలు, గోపవరం, అట్లూరు, బి.కోడూరు మండలాలకు నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శులు ఎం.అంకయ్య, బి.నరసింహారెడ్డి, ఆయా మండలాల గౌరవాధ్యక్షులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణంరాజు, నందకిషోర్‌రెడ్డి, జి.శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కె.వి.రమణ, నారాయణస్వామి, చెన్నకృష్ణయ్య, హరినాథ్, బాబూరావు, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలుకు కృషి


డీఎస్సీ ఫోరం సభ్యులతో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలయ్యేలా కృషి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబర్‌కు ముందు నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన అందరికీ మెమో 57 అమలుచేసి పాత పెన్షన్ అమలు చేయాలని సీఎంతో చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీడీ. వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఆర్.వెంకటజనార్ధన్‌రెడ్డి, రిజ్వాన్ అలీ, సుధాకర్, సునీత, షరీఫ్, రామిరెడ్డి, చంద్రకళ, మహేశ్వరరెడ్డి, గురుస్వామి, పుల్లయ్య, గురుప్రసాద్, బాల జోజప్ప, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీలు బూటకమేనా?

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు బూటకమేనా అంటూ మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. కడప ప్రగతిశీల రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఐఆర్ ప్రకటిస్తామని, మెరుగైన పీఆర్సీ అమలుచేస్తామని హామీ ఇచ్చి.. అధికారం వచ్చాక మరిచిపోయారన్నారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ 28 నెలల కాలంగా పీఆర్సీ కమిషన్ నియమించకపోవడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి అన్నారు. ఆర్థిక వెసులుబాటు చూసుకొని పీఆర్సీ ప్రకటిస్తామని చంద్రబాబు చెప్పడం చూస్తే ఉపాధ్యాయులు నష్టపోయినట్లే అన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.చిన్నరెడ్డన్న మాట్లాడుతూ పెన్షనర్లకు 15 నెలలుగా గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ ఎన్‌కాష్‌మెంట్ చెల్లించకపోవడంతో ఆర్థికబాధలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. డబ్బులు లేక కొందరు అనారోగ్యంతో చనిపోతున్నారని, మరింతమంది తమ పిల్లల పెళ్లిళ్ల చేయలేకపోతున్నారన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవా దృక్పథం


సర్టిఫికెట్లను అందుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు

మైదుకూరు : విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని యోగి వేమన యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.వెంకటరామిరెడ్డి, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా స్థానిక ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సేవా గుణాన్ని అలవర్చుకుంటే క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారన్నారు. శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిత్య జీవితంలో అమలు చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏడు రోజులపాటు జరిగిన శిబిరంలో నిర్వహించిన మొక్కలు నాటడం, పరిశుభ్రత, ఆరోగ్యం, స్వచ్ఛంద ఓటరు అవగాహన వంటి కార్యక్రమాల్లో విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని కలిగించాయని పేర్కొన్నారు. వారం రోజులపాటు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలకు సహకరించిన కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. చివరి రోజున కాలనీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న 50 మంది వలంటీర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైవీయూ ప్రొఫెసర్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ అధికారి డాక్టర్ మధుబాబు, సీనియర్ అధ్యాపకుడు సుబ్బరాయుడు, ఎస్‌బీఎస్ వైఎం కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవి కళ్యాణ పాల్గొన్నారు.

ఎస్‌బీఎస్‌వైఎం కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం


ఎన్‌సీసీ క్యాడెట్లతో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, బెటాలియన్ అధికారులు

మైదుకూరు : పట్టణంలోని ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ (నేషనల్ క్యాడెట్ కార్ప్స్) యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 ఆంధ్రా బెటాలియన్ ఆర్మీ సోల్జర్స్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించి ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేశారు. అనంతరం బెటాలియన్ అధికారులు కళాశాల కరస్పాండెంట్ బాలశివయోగేంద్ర మహారాజ్, ప్రిన్సిపాల్ ఎస్‌బీ సురేష్‌బాబు, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్ భూమిరెడ్డి రవికళ్యాణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలతోపాటు దేశానికి నిస్వార్థ సేవ చేసే దృక్పథం అలవడుతుందన్నారు. ఎన్‌సీసీలో ప్రతి సంవత్సరం మొదటి సంవత్సరం విద్యార్థులను ఎన్‌సీసీ క్యాడెట్లుగా చేర్చుకుని సైన్యం, నావికాదళం, వాయుసేన విభాగాల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని వివరించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


వైఎస్సార్‌సీపీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 4, 10వ వార్డుల కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కమిటీల సన్నాహక సమావేశాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి వివిధ విభాగాల పార్టీ కమిటీల సభ్యులను నియమించుకొని రాష్ట్ర పార్టీ శాఖకు పంపాలని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రేమ, అభిమానం, వైఎస్ జగన్‌పై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ వివిధ అనుబంధ సంఘాల కమిటీలలో భాగస్వాములు కావాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా వారి తరఫున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారం చేపడుతుందని, ప్రజలకు మరింత సేవచేసే భాగ్యం మనకు కలుగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ డైరెక్టర్ లక్కిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఎం.కామేశ్వరరావు, రమణారెడ్డి, పుల్లారెడ్డి, గజ్జల కళావతి, పార్వతి, మోహన్, శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యకు పేదరికం అడ్డు కారాదు


ఉపకార వేతనం అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : విద్యకు పేదరికం అడ్డు కారాదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని రెడ్ల కల్యాణ మండపంలో రెడ్డి సేవా సంఘం వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రతిభగల పేద రెడ్డి విద్యార్థులకు ఉపకార వేతనాలు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రెడ్ల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరెడ్డి మాట్లాడుతూ పేదరికమే ప్రామాణికంగా ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు డి.రామిరెడ్డి మాట్లాడుతూ 116 మంది విద్యార్థులకు రూ.16,500 ఉపకార వేతనాలను పంపిణీ చేశామన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.10 వేలు, బీటెక్ వారికి రూ.15వేలు, మెడిసిన్ చదివే వారికి రూ.20 వేల నగదు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో చదిపిరాళ్ల నారాయణరెడ్డి, డాక్టర్ వైవీ.రామమునిరెడ్డి, డాక్టర్ డి.రామిరెడ్డి, శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ కోగటం బాలవీరారెడ్డి, జి.రాజగోపాల్‌రెడ్డి, అన్నవరం రామమోహన్‌రెడ్డి, గురివిరెడ్డి, సుధాకర్ రెడ్డి, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో తీరని నష్టం


కోటి సంతకాల సేకరణ పత్రాలను విడుదల చేస్తున్న బంగారు మునిరెడ్డి, శేఖర్ యాదవ్, తదితరులు

ప్రొద్దుటూరు : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో ప్రజలకు తీరని నష్టం జరుగుతోందని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండలంలోని సోములవారిపల్లె పంచాయతీ ఈశ్వర్‌రెడ్డినగర్‌లో జరిగిన సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేశారని, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించి పేదలకు తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, రమణయ్య, మార్తల ఓబుళరెడ్డి, అక్బర్, సుబ్బయ్య, బోస్, బాషా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని బీసీ సమాఖ్య ఆధ్వర్యంలో హోలిస్టిక్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్లు రాజశేఖర వర్మ, హరీష్ బాబు, నాగశేఖర్‌రెడ్డి, పీఎల్ఎస్ రెడ్డి 180 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, సమాఖ్య సహాధ్యక్షుడు సందు శివనారాయణ, కోశాధికారి రామసుబ్బయ్య యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాశ్, దేవానంద్, బి.వెంకటరాజు, సుబ్బయ్య, చల్లా రాజగోపాల్, లక్ష్మీదేవి, దస్తగిరమ్మ తదితరులు పాల్గొన్నారు.